క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మెదక్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఇటీవల మెదక్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.

అందరి జీవితాల్లో వెలుగులు విరబుయాలి

ఎమ్మెల్యే సునీతారెడ్డి



నర్సాపూర్: అందరి జీవితాల్లో వెలుగులు విరబుయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి పట్టణ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ప్రజలు జరుపుకునే దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు, సుఖ సంతోషాలు నింపాలని ఆమె ఆకాంక్షించారు. కాగా పండుగ సందర్భంగా బాణాసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె హితవు పలికారు.

పీహెచ్‌డీ గ్రహీతకు సన్మానం



ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

మెదక్ కలెక్టరేట్: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల ఉపన్యాసకుడు ప్రవీణ్ కుమార్‌కు రాజస్తాన్‌లోని జగదీష్ ప్రసాద్ జబర్మల్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ అందజేశారు. ప్రొఫెసర్ అన్షు శర్మ పర్యవేక్షణలో సామాజిక అంశాలు–వ్యక్తులపై ప్రభావం అను అంశంపై వీరు పరిశోధన చేశారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ ప్రవీణ్ కుమార్‌ను ప్రిన్సిపాల్ డా. హుస్సేన్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ తిరుమలరెడ్డి, డాక్టర్ నాగేంద్రరావు, డాక్టర్ శ్రీలత, డాక్టర్ శరత్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ వామనమూర్తి, డాక్టర్ కిరణ్ కుమార్‌లు పాల్గొన్నారు.

ఆర్‌ఐ-2గా వెంకటేశ్వర్



శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట ఆర్‌ఐ -2 గా వెంకటేశ్వర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఆర్‌ఐ సునీల్ చిలిపిచెడ్ మండలానికి బదిలీ కాగా అక్కడి నుంచి వెంకటేశ్వర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్‌కు రిపోర్టు చేసి విధుల్లో చేరారు.

కరెంట్ కోతలతో ఇబ్బందులు

నర్సాపూర్: పట్టణంలో కరెంట్ సరఫరాలో పలుమార్లు అంతరాయం కలుగడంతో ఇబ్బందుల పడువుతున్నామని వినియోగదారులు ఆరోపించారు. బుధవారం పట్టణంలో కరెంట్ సరఫరాలో పలుమార్లు కోత విధించారని చెప్పారు. సరఫరాలో కోత విధించడంతో విద్యుత్‌పై ఆధారపడిన వ్యాపారాలు సరిగా సాగడం లేదని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేస్తామని ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రకటిస్తు..న్నా పట్టణంలో అంతరాయం ఎక్కువగా ఏర్పడుతుందని వినియోగదారులు చెప్తున్నారు. అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా చేయాలని వారు కోరారు. ఈ విషయమై మండల విద్యుత్ శాఖ ఏఈ రాంమూర్తిని వివరణ కోరగా.. కరెంట్ సరఫరా నిలిచిన విషయం తన దృష్టికి రాలేదని, మళ్లీ అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకుంటానని అన్నారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి



ఈశ్వరయ్యను సన్మానిస్తున్న ఆర్‌జేడీ మల్లేశం, మార్కెట్ కమిటీ ఉద్యోగులు

చేగుంట(తూప్రాన్): ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని మార్కెట్‌కమిటీ హైదరాబాద్ ఆర్‌జేడీ మల్లేశం అన్నారు. బుధవారం చేగుంట మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ ఈశ్వరయ్య పదవ విరమణ వీడ్కోలు సన్మాన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఉద్యోగులకు పదవ విరమణ తప్పనిసరిగా ఉంటుందని తెలిపారు. ఈశ్వరయ్యను ఆర్‌జేడీతో పాటు ఉమ్మడి జిల్లా ఉద్యోగులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి యాదయ్య, సంగారెడ్డి అధికారి రియాజ్, కార్యదర్శి మధురిక, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సునీల్, ఈశ్వర్‌కుమార్, సిబ్బంది నర్సింలు తదితరులు ఉన్నారు.

ఇంటింటి సర్వే సమగ్రంగా చేయాలి

ఇంటింటి కుటుంబ సర్వేను సమగ్రంగా చేయాలని అధికారులు అన్నారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఐకేపీ సీఏలకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ప్రణాళిక ప్రకారం ఇంటింటి కుటుంబ సర్వే చేయాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు.



శివ్వంపేట(నర్సాపూర్): అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారులు



పెద్దశంకరంపేట(మెదక్): సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా



చిలప్‌చెడ్(నర్సాపూర్): ఇంటింటి సర్వే గురించి మాట్లాడుతున్న అధికారి



నర్సాపూర్ ఆర్‌డీఓ మహిపాల్‌ను సన్మానిస్తున్న ఎంపీడీఓ ఇతర అధికారులు



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగిలో మాట్లాడుతున్న తహసీల్దార్ కరీం



కౌడిపల్లి(నర్సాపూర్): మాట్లాడుతున్న ఆర్‌డీఓ మహిపాల్



వెల్దుర్తి(తూప్రాన్): మాట్లాడుతున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి



కౌడిపల్లి(నర్సాపూర్): తిమ్మాపూర్‌లో మాట్లాడుతున్న ఏఎస్‌ఐ శ్రీనివాస్

కులవివక్ష చూపొద్దు:ఏఎస్‌ఐ

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామంలో ప్రజలంతా కలిసి మెలసి ఉండాలని, కులవివక్ష చూపావద్దని ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని తిమ్మాపూర్‌లో సివిల్ రైట్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలంతా కులవవిక్ష, అంటరానితనం లేకుండా జీవించాలని చెప్పారు. సమస్యలుంటే అధికారులకు తెలియచేయాలని సూచించారు. మద్యం సేవించొద్దన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి సుజాత, బాగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

అందరూ కలిసిమెలిసి ఉండాలి

శివ్వంపేట(నర్సాపూర్): కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉండాలని ఆర్‌ఐ కిషన్ అన్నారు. మండల పరిధిలోని పోతులబోగూడ గ్రామంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు.



పోతులబోగూడలో మాట్లాడుతున్న ఆర్‌ఐ కిషన్

నార్లాపూర్‌లో..

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో బుధవారం గ్రామపంచాయతీ ఆవరణలో తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమేశ్, ఏఎస్‌ఐ జయపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ రికార్డు అసిస్టెంట్ రాజలింగం, జగన్, గౌడుగుపల్లి చంద్రం, మిరుదొడ్డి కిషన్, నర్సింలు, ఇందిర అనసూయ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట(మెదక్): నార్లాపూర్‌లో ..

వసురాం తండాలో..

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని వసురాం తండా గ్రామపంచాయతీ ఆవరణలో సివిల్స్ రైట్స్ డే నిర్వహించారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, తండా గిరిజనులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు



పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ఒప్పందం పత్రం చేసుకుంటున్న ప్రిన్సిపాల్ హుస్సేన్

మెదక్ కలెక్టరేట్: జిల్లా హెడ్ పోస్ట్ ఆఫీస్‌తో కామర్స్ విభాగం అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు మెదక్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ తెలిపారు. బుధవారం కళాశాలలో పోస్టల్ అధికారులతో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగు పడనున్నట్లు తెలిపారు. అలాగే పోస్టల్ డిపార్ట్‌మెంట్ కల్పించే సేవలపై విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ హెడ్ డాక్టర్ శరత్ రెడ్డి, డాక్టర్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన పక్కాగా చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాల్లో చేపట్టే బీసీ కులగణనను పక్కాగా చేయాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండల ఎన్యూమరేటర్లకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ లక్ష్మీనర్సయ్య, డీటీ కౌశిక, వివిధ శాఖల అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ట్యాంకుల నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సరఫరా కోసం నీటి ట్యాంకులు నిర్మించేందుకు బుధవారం స్థలాన్ని పరిశీలించామని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ చెప్పారు. మున్సిపాలిటీకి రూ.12 కోట్లు వచ్చాయని, ఆ నిధులతో పట్టణంలో రెండు ట్యాంకులు నిర్మిస్తే తాగునీటి సరఫరాలో ఉన్న ఇబ్బందులన్ని తొలగిపోతాయని ఆయన చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, కౌన్సిలర్లు సురేశ్, యాదగిరిలతో కలిసి ఆయన పలు ప్రాంతాలను పరిశీలించారు.

బస్టాప్ ఏర్పాటు చేయించండి



ఎంపీ ఈటల రాజేందర్‌తో మనోహరాబాద్ యువకులు

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రానికి బస్టాప్ ఏర్పాటు చేయించాలని మనోహరాబాద్ యువకులు బుధవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు యువకులు మాట్లాడుతూ రామాయపల్లి వద్ద జాతీయ రహదారిపై రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టి సంవత్సరాలవుతున్నా.. పనులు పూర్తి కావడం లేదని, ఆ పనులను పూర్తి చేయించాలని కోరినట్లు తెలిపారు. మండల కేంద్రంలో బస్టాప్ ఏర్పాటు చేయించి ప్రయాణికుల ఇక్కట్లు తీర్చాలని కోరామన్నారు. ఈ సందర్భంగా ఎంపీ స్పందిస్తూ నేషనల్ హైవే ప్రతినిధులతో మాట్లాడారన్నారు. ఆర్టీసీ యజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అనిల్, గణేశ్, శ్రీధదర్, మణివర్దన్ తదితరులున్నారు.

చిలప్‌చెడ్ ఆర్‌ఐగా సునీల్‌సింగ్ చౌహన్

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ ఆర్‌ఐగా సునీల్‌సింగ్ చౌహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఆర్‌ఐగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్ శివ్వంపేట మండలానికి బదిలీ అయ్యారు. కాగా శివ్వంపేట మండల ఆర్‌ఐగా విధులు నిర్వహించిన సునీల్‌సింగ్ చిలప్‌చెడ్ మండలానికి బదిలీపై వచ్చారు.

ఉషా పోటీలకు క్రీడాకారుల ఎంపిక పూర్తి

నర్సాపూర్: రాష్ట్ర స్థాయి ఉషా పోటీలకు బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడాకారులను ఎంపిక చేశారు. మెదక్ జిల్లా క్రీడా సమాఖ్య విభాగం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా, ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారని టోర్నమెంట్ ఇన్‌చార్జి పీడీ పూర్ణచందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్17, అండర్ 19 విభాగాల్లో 18 మంది వంతున క్రీడాకారులను ఎంపిక చేసినట్లు చెప్పారు. నవంబర్ రెండు నుంచి నాల్గవ తేదీ వరకు మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఉషా పోటీల్లో ప్రస్తుతం ఎంపికైన జట్లు పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో ఉషా ఉమ్మడి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య, మాస్టర్లు లక్ష్మణ్, తార తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

– బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారాం



బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న గంగారాం

రామాయంపేట(మెదక్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం 50 రిజర్వేషన్లు కలిప్ంచాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారాం డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డిలో బీసీ కమిషన్‌ను కలిసి వినతిపత్రం అందజేశామని ఆయన తెలిపారు. అనంతరం గంగారాం మాట్లాడుతూ.. జిల్లాలో కుల గణన పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కులాల వారీగా జనాభా వివరాలు బహిరంగ పర్చాలని, జనాభా గణన సమయంలో ప్రతి ఒక్కరూ తమ పేరు పక్కనే విధిగా కులం పేరును నమోదు చేయించాలన్నారు. కుల గణన సమయంలో అధికారులకు సహకరించాలన్నారు.

‘ఉపాధి’ పక్కదారి

- సామాజిక తనిఖీలో బయటపడ్డ అక్రమాలు
- రికవరీ, జరిమానాలు రాస్తున్న చెల్లించని సిబ్బంది
- చర్యలకు వెనుకడుగు వేస్తున్న అధికారులు

అల్లాదుర్గం(మెదక్): ఉపాధిహామీ పథకం అక్రమార్కులకు వరప్రసాదంగా మారింది. పనుల్లో అవినీతి అక్రమాలు బయటపడ్డా.. తూతూ మంత్రంగా చర్యలు తీసుకొని చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలున్నాయి. ఉపాధి హామీ సిబ్బంది ఏటా లక్షలు దోచుకుంటున్నా.. సామాజిక తనిఖీలో బయటపడుతున్న మండల స్థాయి అధికారులపై, సిబ్బందిపై చర్యలు తీసుకోవడం లేదు. రికవరీ, జరిమానాలు వేస్తూ వదిలివేయడంతో యథేచ్ఛగా అక్రమాలు జరుగుతునే ఉన్నాయి. మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగిన విషయం సామాజిక తనిఖీలో బయట పడింది. అల్లాదుర్గం మండలంలో 1-04-2023 నుంచి 31-03-2024 వరకు 312 పనులు ఉపాధిహామీ పథకం కింద చేపట్టారు. కూలీల ఉపాధి పనులకు రూ.3 కోట్ల 23లక్షల 23 వేలు, మెటీరియల్ పనులకు రూ.35 లక్షల 47 వేల763 పనులు చేపట్టారు. ఉపాధి పనుల్లో కొలతలు చేయకుండా, ఇళ్లను చూయించి పశువుల షేడ్‌ల పేరుతో, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు పనులు చేయకున్నా.. బినామీ పేర్లపై నిధులు స్వాహా చేశారు. సామాజిక తనిఖీలో అక్రమాలు బయట పడటంతో అధికారులు ఎప్పటిలాగే రూ. 3 లక్షల 74 వేల 620 రికవరీకి, మరో రూ.59100 జరిమానా విధించారు. సిబ్బంది రికవరీ డబ్బులు, జరిమానాలు ఎన్నేళ్ల వరకు చెల్లిస్తారో వెచిచూడాల్సిందే. ఇప్పటికైన కలెక్టర్ స్పందించి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మురికితో విద్యార్థులకు ఇబ్బందులు



నీలకంఠిపల్లి పాఠశాల ఎదుట మురికికూపం

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని నీలకంఠిపల్లి గ్రామంలోని పాఠశాల ఎదుట మురికితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మూడు నెలల క్రితం జిల్లా పంచాయతీ అధికారి గ్రామంలో పర్యటించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆయన దృష్టికి మురికి సమస్యను తీసుకెళ్లారు. వెంటనే శుభ్రం చేసి, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చేయాలని డీపీఓ కార్యదర్శిని ఆదేశించారు. పనులు చేయించాల్సిన కార్యదర్శి మూడు నెలలుగా పట్టించుకోవడం లేదు. ఆగస్టు 9న డీపీఓ నీలకంఠిపల్లి గ్రామానికి రాగా.. పంచాయతీ కార్యదర్శి గ్రామానికి రావడం లేదని సమస్యలు పట్టించుకోవడం లేదని డీపీఓకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో డీపీఓ కార్యదర్శికి పనులు త్వరగా చేయాలని చెప్పాడు. మూడు నెలలు అవుతున్నా.. కార్యదర్శి కిరణ్ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పేదల ఆరోగ్యానికి భరోసా సీఎంఆర్‌ఎఫ్



కొల్చారం(నర్సాపూర్): పేదల ఆరోగ్యానికి భరోసాగా సీఎంఆర్‌ఎఫ్ సాయంగా పనిచేస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన పోచయ్యకి, రామకృష్ణకి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బుధవారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రాజాగౌడ్‌కి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చెన్నయ్య, వెంకటేశం, కృష్ణ తదితరులు ఉన్నారు.

◆ వైద్య సేవలు అందక ఇబ్బందులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉచిత పశు వైద్య సేవలు అందక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని చండి గ్రామానికి చెందిన పాడి రైతు ఆంజనేయులు బుధవారం ఆరోపించాడు. తన పాడిగేదెలు అనారోగ్యానికి గురికావడంతో పశువర్ధక శాఖకు సంబంధించి ఉచిత పశు అంబులెన్స్ కోసం 15 రోజుల నుంచి ఫోన్ చేస్తున్నప్పటికీ స్పందించడం లేదని బాధిత రైతు వాపోయాడు. సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పశు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ కౌడిపల్లి ఆర్‌ఐగా లక్ష్మణ్



కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండల ఆర్‌ఐ (రెవెన్యూ ఇన్స్‌పెక్టర్)గా లక్ష్మణ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. శివ్వంపేట మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన లక్ష్మణ్ ఆర్‌ఐగా ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఆర్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీహరి సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు చేపట్టారు.

◆ ఆర్‌ఐల బాధ్యతల స్వీకరణ



నిజాంపేట(మెదక్): మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇద్దరు నూతన ఆర్‌ఐలు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు నిర్వహించిన ఆర్‌ఐ గంగాధర్‌గౌడ్ బదిలీపై మెదక్ ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లారు. అతనికి బదులుగా మెదక్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఇమాద్, ఆర్డీఓ కార్యాలయం నుంచి ప్రీతి మండల తహసీల్దార్‌కు బదిలీపై ఆర్‌ఐలుగా బాధ్యతలు స్వీకరించారు.

◆ విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి



శివ్వంపేట(నర్సాపూర్): విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గూడూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బొట్టు కిషన్ పాడిగేదెలతో జీవనోపాధి పొందుతున్నాడు. రోజువారిగానే తన పాడిగేదెలను మేత కోసం పొలాల వద్దకు తీసుకెళ్లాడు. మేత మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగిలి పాడిగేదె అక్కడికక్కడే మృతి చెందింది. పాడిగేదె విలువ రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

◆ భగీరథ పైప్‌లైన్ లీకేజీ



శివ్వంపేట(నర్సాపూర్): మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి నీరు వృథాగా పోతోంది. మండల పరిధిలోని ఏదుల్లాపూర్ గ్రామానికి నీటి సరఫరా చేసి భగీరథ పైప్‌లైన్ వ్యవసాయ పొలంలో లీకై ంది. దీంతో నీరు నిత్యం వృథాగా పోతుంది. వరి పంట కోత దశలో ఉందని పైప్‌లైన్ లీకేజీ సరిచేయాలని పలుమార్లు సిబ్బందికి చెప్పినా.. పట్టించుకోవడం లేదని రైతు కల్లూరి పద్మయ్య అన్నారు. ఈ విషయం గురించి మిషన్ భగీరథ నీటి సరఫరా డీఈ ప్రవీణ్ దృష్టికి తీసుకెళ్లాగా.. సిబ్బందిని పంపించి లీకేజీ సరిచేయిస్తామని చెప్పారు.